క్లుప్తంగా

గ్రామాల్లో ఫీవర్ సర్వే



నిల్వ నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పోతునూరు వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం పోతునూరు పీహెచ్‌సీ పరిధిలో శివారు గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. శీతాకాలంలో తీసుకోవాల్సిన ఆరోగ్య, ఆహార జాగ్రత్తలను వివరించారు. కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ డబ్బాలు, రోళ్లు, ఇతర వస్తువుల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. సామూహిక ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లించారు.

మాలసేన లక్ష్య సాధనకు కృషి



గంటా పండు

దెందులూరు: ఏలూరు జిల్లాలో మాలసేన లక్ష్య సాధనకు, మాలల ఐక్యత, అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాలసేన ఏలూరు జిల్లా కార్యదర్శి నియమితులైన గంటా పండు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని జిల్లా, డివిజన్, పట్టణ, మండల, గ్రామ కమిటీలను సమన్వయం చేసుకుని సేవలందిస్తానని చెప్పారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా కార్యదర్శిగా నియమించిన పెద్దలకు పండు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా బాలవెంకటేశ్వరుని గ్రామోత్సవం



అర్ధవరంలో బాలవెంకటేశ్వరుని గ్రామోత్సవం

గణపవరం: మండలంలోని అర్ధవరం గ్రామంలోని శ్రీదేవీ, భూదేవి సమేత బాలవెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారిని శేషశయన వాహనంపై ఉంచి వీధుల్లో ఊరేగించారు. సాగిరాజు సుబ్బరాజు, సత్యవతి దంపతులు ఆలయ ప్రధాన అర్చకుడు పెద్దింటి రామప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారి తిరుప్పాడసేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారిని, అమ్మవార్లను వివిధ రకాల పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ ఉత్సవాలు ఈనెల 26 వరకు కొనసాగుతాయని ఉత్సవ కమిటీ పేర్కొంది.

నీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై శిక్షణ



ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

దెందులూరు: నీటిసంఘాల ఎన్నికలు విమర్శలకు తావు ఇవ్వకుండా నిర్వహించాలని తహసీల్దార్ బి.సుమతి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కృష్ణస్వామి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికల బాధ్యతలు చేపట్టిన ఉద్యోగులకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు.

వైభవంగా అయ్యప్పల నగర సంకీర్తన



పల్లకి మోస్తున్న మహిళా భక్తులు

భీమడోలు: గుండుగొలనులో శనివారం మాలధారుల నగర సంకీర్తన వైభవంగా నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుతూ అయ్యప్ప స్వామి ఆలయంలో నుంచి అయ్యప్ప స్వామి, శ్రీఆంజనేయ స్వామి, శివ స్వామి, శ్రీశ్రీ అమ్మవార్లను పల్లకీపై ఉంచి చక్రస్నానం కోసం మేళతాళాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. అర్చకులు లంకా శివకుమార్, అజేయ్‌ల ఆధ్వర్యంలో గోదావరి కాల్వలో చక్రస్నానం చేయించారు. అక్కడ నుంచి కన్య మాతలు కలశాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. స్వామి పల్లకీని మోశారు. కార్యక్రమంలో గురుస్వాములు చీమల చిన్నారావు, దార్ల రంగారావు, నల్ల శంకర్, ముత్యాల నరసింహారావు, అయ్యప్పలు పాల్గొన్నారు.

ఆటుపోట్లతో సార్వా వరి సాగు

- వాతావరణ మార్పులతో ఉరుకులు, పరుగులు
- రైతులకు అవస్థలు



వర్షానికి తడవకుండా ధాన్యం రాశులపై కప్పిన ప్లాస్టిక్ బరకాలు



ధాన్యం ఎండబెడుతున్న రైతు

గణపవరం: సార్వా వరి సాగు ఆరంభం నుంచి ఆటుపోట్లతోనే సాగుతోంది. చివరి దశలోనూ రైతులకు అవస్థలు తప్పడంలేదు. పంట చేతికందిన సమయంలో వాతావరణంలో మార్పులు రైతులను కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. పంటను సజావుగా అమ్ముకోవడానికి వారు ఆరాటపడుతున్నారు. ధాన్యం రాశుల వద్ద ప్లాస్టిక్ బరకాలు, టార్పాలిన్‌లతో కాపలా కాస్తున్నారు. రైతులు ధాన్యం ఎండబెట్టడం, ఎండబెట్టిన ధాన్యాన్ని రాశులు చేసి బరకాలు కప్పుకుంటూ నానా హైరానా పడుతున్నారు. వారం రోజులుగా వాతావరణం అనుకూలంగా మారిరోజూ ఎండకాయడంతో రైతులు మాసూళ్ల ముమ్మరం చేశారు. ఎక్కడ చూసినా రైతులు ధాన్యాన్ని ఎండబెడుతూ కనిపిస్తున్నారు. ఎండలు కాస్తున్నా, వారం రోజులుగా మంచుకూడా ఎక్కువగా కురుస్తుండటంతో ధాన్యంలో తేమశాతం తగ్గడానికి సమయం పడుతుంది. ఇప్పటికే పూర్తిగా ఆరిన ధాన్యం రాశులు చేసి బరకాలు, టార్పాలిన్లు కప్పారు.

రైతులకు మద్దతు ధర

తేమశాతం 17లోపు తీసుకురావడానికి రైతులు నానాపాట్లు పడుతున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో సుమారు 80 వేల ఎకరాల్లో సార్వా సాగు చేయగా, ఇందులో 50 నుంచి 60 శాతం ధాన్యాన్ని మిల్లులకు తరలించగా, 50 శాతం రైతులు వరి కోతలు పూర్తిచేసి, ధాన్యం రాశులు రోడ్లు, పుంతగట్లు, ఖాళీ ప్రదేశాలకు ఆరబెట్టుకుంటున్నారు. తేమ శాతం 17లోపు వస్తేనే ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుంది.

నెలాఖరుకు కోతలు పూర్తి

ఉంగుటూరు నియోజకవర్గంలోని భీమడోలు, ఉంగుటూరు మండలాలలో దాదాపు 80 శాతం మాసూళ్లు పూర్తికాగా, గణపవరం, నిడమర్రు మండలాలలో 50 శాతం పూర్తయ్యాయి. ఈ నెలాఖరుకు వరికోతలన్నీ పూర్తవుతాయని అంచనా. అప్పటి వరకు వాతావరణం అనుకూలిస్తే అందరూ గట్టెక్కుతామని రైతులు చెబుతున్నారు.

ఆరంభం నుంచి కష్టాలే

సార్వాసాగుఆరంభం నుంచి రైతులకు కష్టాలు వెంటాడుతున్నాయి. నారుమడుల దశలోనూ, వరినాట్ల దశలోను కురిసిన భారీ వర్షాలకు రైతులు రెండోసారి నారుమడులు, వరినాట్లు వేశారు. కొందరు రైతులు మూడోసారి కూడా నాట్లు వేయాల్సివచ్చింది. దీనితో పెట్టుబడులు అమాంతం పెరిగిపోయాయి. ఎకరాకు ఐదారువేల రూపాయలు అదనంగా రైతులంతా ఖర్చుచేయాల్సి వచ్చింది.

తగ్గిన దిగుబడి

సార్వా పంట దిగుబడులు ఎకరాకు 40 బస్తాలకు మించడం లేదు. కొన్ని చోట్ల 35 బస్తాల నుంచి 40 బస్తాల మధ్యలోనే ఉంటుంది. ఇలాంటి రైతులకు నష్టాలు తప్పడం లేదు. నికరంగా 40 బస్తాలు వస్తే 20 బస్తాలు మగ్తా పోను, మిగిలిన దాంతో కనీసం పెట్టుబడులతో బయటపడే అవకాశం ఉంది. అంతకు తగ్గితే ఆమేరకు రైతులకు చేతి చమురు వదిలించుకోక తప్పదని రైతులు, కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కష్టానికి తగిన ఫలితం లేదు



సార్వా సాగులో రైతులకు కష్టానికి ఫలితం దక్కే పరిస్థితి లేదు. ఐదెకరాలు కౌలుకు చేస్తున్నాను. ఎకరాకు 40 బస్తాలు దిగుబడి వచ్చింది. 20 బస్తాలు కౌలు పోను మిగిలిన 20 బస్తాలు పెట్టుబడికి సరిపోతాయి. ఆరుగాలం పడ్డ శ్రమ అంతా వృథాయే. కనీసం పెట్టుబడివస్తే చాలు అనుకునే పరిస్థితి. సార్వా ఆరంభంలో భారీ వర్షాలకు నారుమడులు, వరినాట్లు దెబ్బతినడంతో రెండుసార్లు వేయడంతో పెట్టుబడి పెరిగిపోయింది. కోత యంత్రాలు లేకుండా రైతుకు ఎకరాకు ఏడెనిమిది వేల రూపాయలు అదనంగా ఖర్చయ్యేది.

– సింగులూరు సత్యం, కౌలురైతు

స్కాలర్‌షిప్ రాక విద్యార్థుల ఇక్కట్లు

దెందులూరు: ప్రభుత్వం స్కాలర్‌షిప్ మంజూరు చేయకపోవడంతో గోపన్నపాలెం వ్యాయామ కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం కళాశాలలో వారు మాట్లాడుతూ కళాశాలలో అండర్ గ్రాడ్యుయేషన్ డిప్లమో బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రెండు వ్యాయామ విద్య కోర్సులు ఉన్నాయని, ప్రభుత్వం తమకు ఇబ్బందులు లేకుండా స్కాలర్‌షిప్ వెంటనే మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు ఇక్కడ విద్యాభ్యాసం చేస్తున్నారని తెలిపారు.

వరి కోత మెషీన్ల కిరాయిలను నియంత్రించాలి

దెందులూరు: జిల్లాలో వరి కోత మెషీన్ల కిరాయిలను నియంత్రించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కోత మెషీన్లకు కిరాయి గంటకు రూ.3000 నుంచి రూ.3500 వరకు పెంచేశారని తెలిపారు. నేలకొరిగిన వరిని మెషీన్‌తో కోసేందుకు మూడు గంటల వరకు సమయం పడుతుందన్నారు. దీంతో ఎకరా చేలో వరి కోయడానికి రూ.10 వేలకు పైగా రైతు పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని తెలిపారు. కోత మెషీన్ల కిరాయిలను ఉన్నతాధికారులు పర్యవేక్షించకపోవడంతో రైతులు, కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్, సంఘం దెందులూరు మండలం అధ్యక్షుడు గండి రాజా కోరారు.

వైభవంగా సత్యసాయి జయంతి



భీమడోలులో చిన్నారుల శ్రీఆంజనేయ నృత్య ప్రదర్శన

భీమడోలు: స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం సత్యసాయి 99వ జయంతిని వైభవంగా నిర్వహించారు. సమితి కార్యాలయం వద్ద తెల్లవారుజాము నుంచి విశేష పూజలు చేశారు. నగర సంకీర్తన, నామసంకీర్తనాలతో గ్రామం మార్మోగింది. సత్సంగ ప్రవచనం చేశారు. బాల వికాస్ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీఆంజనేయ రూపకం అలరించింది. స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆశ్రం ఆసుపత్రి వారిచే ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. రోగులకు ఉచితంగా మందులను అందించారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి కన్వీనర్ వర్ధనీడి సత్యసాయి మాట్లాడుతూ శ్రీసత్యసాయి చూపిన సేవా, ప్రేమ మార్గంలో సభ్యులంతా నడుచుకోవాలని, సత్యసాయి బోధనలు అనుచరణీయమని వివరించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలైన బాలవికాస్ విద్యార్థులకు బహుమతులను అందించారు. అనంతరం నారాయణ సేవలో భాగంగా నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



కైకరంలో సత్యసాయి జయంతి కార్యక్రమం

కైకరంలో పూజలు

ఉంగుటూరు (గణపవరం): ఉంగుటూరు మండలం కైకరంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త జతావల్లభుల జగన్నాథం ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయిబాబా జయంతిని వైభవంగా నిర్వహించారు. గ్రామంలో తెల్లవారు జామున నగర సంకీర్తన నిర్వహించారు. బ్రహ్మశ్రీ వైఎల్ కాంతారావు బ్రహ్మత్వంలో వేద మంత్రోచ్ఛారణలతో పూజలు చేశారు.

బధిరుల పాఠశాలకు ఆర్థిక సాయం

పెదపాడు : ఏపూరు ఆదిత్య బధిరుల పాఠశాలలో అన్నదానం నిమిత్తం శనివారం బాపులపాడు మాజీ సర్పంచ్ కాకాని అరుణ వెంకటేశ్వరరావు దంపతులు రూ.5 వేల నగదు అందించారు. అరుణ మనవడు ఋగద్వజ విద్యార్థుల నడుమ కేకు కట్‌చేసి విద్యార్థులకు పంచారు. కార్యక్రమంలో ప్రన్సిపాల్ ఆకుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య భద్రతపై అవగాహన



గుళ్లపాడులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఉంగుటూరు: గుళ్లపాడు గ్రామంలో శనివారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నిల్వ నీటిని తొలగించారు. ఆరోగ్య భద్రత విషయాలను ప్రజలకు వివరించారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి లక్ష్మణరావు, వైద్య ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లకు వృద్ధులే టార్గెట్



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు (టూటౌన్) : సైబర్ నేరగాళ్లు వృద్ధులనే టార్గెట్ చేస్తుండడంతో డిజిటల్ లావాదేవీల పట్ల జాగ్రత్తగా ఉండాలని డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ అన్నారు. ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న వృద్ధుల కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఏపీకే యాప్‌లు, మెసేజ్లు, లింకును ఓపెన్ చేస్తే ఖాతాదారుల రహస్య సమాచారం ఫొటోలు, బ్యాంక్ అకౌంట్లను హ్యాక్ చేస్తారని హెచ్చరించారు. బ్యాంక్ ఏటీఎం వద్ద వృద్ధులు పక్కవారి సాయం తీసుకునే సమయాల్లో జాగ్రత్తలు వహించాలన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930కి సమాచారం అందించాలని సూచించారు. త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, సైబర్ పోలీస్ స్టేషన్ ఎస్సై మధు వెంకట రాజా సోషల్ మీడియా అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వృద్ధుల సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ) : ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి ఏలూరుకు చెందిన భక్తులు శనివారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఏలూరు గొల్లయిగూడెంకు చెందిన ఎ.వెంకటపతిరావు దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళం అందించారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఆలయ డెప్యూటీ ఈఓ రత్నరాజు దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

డ్రగ్స్ ఉచ్చులో పడొద్దు



సదస్సులో మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

భీమడోలు: మత్తు పదార్థాల ఉచ్చులో పడి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని ఎక్సైజ్ సీఐ బి.సత్యనారాయణ సూచించారు. స్థానిక శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో శనివారం భీమడోలు ఎక్సైజ్ ఆధ్వర్యంలో యువతీ యువకులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు ప్రిన్సిపాల్ బొమ్ము రవికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని, తమ లక్ష్యాల సాధనకు ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని అన్నారు. మత్తు పదార్థాలు వినియోగించే వారిపై పడే కేసులు, శిక్షలను వివరించారు. గ్రామాల్లో మత్తు పదార్థాల సమాచారం తెలిస్తే తమకు దృష్టికి తీసుకుని రావాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్ శివధర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ భవానీ సింగ్, అధ్యాపకురాలు మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

అపార్ నమోదును వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ భాస్కర్‌కుమార్

భీమడోలు: అపార్ నమోదు ప్రక్రియలోని సవరణలు సరిచేసే విధానాన్ని వేగవంతం చేయాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులపై ఉందని ఎంఈఓ అయినపర్తి భాస్కర్‌కుమార్ అన్నారు. భీమడోలు ఎంఆర్సీ కార్యాలయంలో శనివారం అపార్ ఐడీ పెండింగ్, ఇతర అంశాలపై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ భాస్కర్‌కుమార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అపార్ నమోదు 87 శాతం పూర్తైందని, మిగిలిన 13 శాతం త్వరితగతిన పూర్తి చేయాల్సిన బాధ్యత హెచ్‌ఎంలపై ఉందని అన్నారు. ఆధార్ కార్డులోని సవరణలకు జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా అవసరమని, సంబంధిత పత్రాలతో సమీపంలోని ఆధార్ నమోదు కేంద్రానికి విద్యార్థులను హెచ్‌ఎంలు తీసుకెళ్లి సరిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి రోజూ ఆధార్ సవరణలు, జనన ధ్రువీకరణ పత్రం పొందే విషయాలను పరిశీలించాలని, తల్లిదండ్రులకు అవగాహన కోసం పాఠశాలలో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యదేవుని వ్రతాలు



సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

గణపవరం: బువ్వనపల్లిలోని శ్రీబాల వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా ఆలయం వద్ద సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో దంపతులు పెద్దసంఖ్యలో స్వామివారి వ్రతాలు చేశారు. ప్రధానార్చకులు శ్రీనివాసుల సుబ్రహ్మణ్యం, శ్రీనివాసుల రాంబాబుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పూజలో పాల్గొన్న దంపతులకు ఉత్సవకమిటీ పూజాసామగ్రిని అందించింది. ఆలయ కమిటీ చైర్మన్ అలుమోలు ఏసుబాబు, ప్రముఖ దాత సంకుపల్లయ్యల ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. భక్తుల విరాళాలతో స్వామివారికి సుమారు రూ.10 లక్షల వ్యయంలో నిర్మించిన నూతన రథంలో స్వామివారి యాత్ర నిర్వహించారు. భక్తులు స్వామివారి రథాన్ని తాడుతో లాగారు. ఆలయం వద్ద భారీ కార్తీక వన సమారాధన ఏర్పాటుచేశారు. బువ్వనపల్లి పరిసర గ్రామాల నుంచి సుమారు 4 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు.

బాల్యవివాహాలు చట్టవిరుద్ధం



సదస్సులో మాట్లాడుతున్న విజయలక్ష్మి

ఉంగుటూరు (గణపవరం): బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని, వీటి వల్ల విలువైన జీవితం నిర్వీర్యమవుతుందని భీమడోలు ఐసీడీఎస్ సీడీపీఓ కేవీఎస్ విజయలక్ష్మి అన్నారు. శనివారం ఉంగుటూరు మండలం కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చైల్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పిల్లల్లో విపరీత ధోరణులు అలవడుతున్నాయని, తల్లిదండ్రుల మాట వినకుండా వారికి దూరమవుతూ, సెల్‌ఫోన్లకు దగ్గరవుతున్నారని వివరించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని సూచించారు. బాల్యవివాహాలు ఎక్కడ జరిగినా హెల్ప్‌లైన్ నెంబరు 1098 లేదా 112కు సమాచారం అందించాలని కోరారు. ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ మాట్లాడుతూ తల్లిదండ్రులను కోల్పోయి బడికి దూరంగా ఉన్నవారిని ఓపెన్ స్కూలు ద్వారా డైరెక్టుగా పది, ఇంటర్ చదవడానికి ఎస్ఎస్ఏ ద్వారా ఫీజులు కట్టి ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న రత్న ప్రసాద్

పెదవేగి : సమాజంలో ప్రతి మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. ఆయన అధ్యక్షతన శనివారం పెదవేగి ఎంపీడీఓ కార్యాలయంలో విధాన్ సే సమాధాన్ (చట్టంతో పరిష్కారం) ఫర్ ఉమెన్ బ్లాక్ లెవెల్-2 మహిళ చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ మహిళా అభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలు, వారి రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల ఫోన్లను తగు జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఉచిత న్యాయ సహాయం 15100కి కాల్ చేసి పొందవచ్చన్నారు. జిల్లా కోర్టు పరిధిలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ ద్వారా నేరం మోపబడిన వారందరికీ ఉచితంగా కేసులు వాదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఉమెన్ కమిషన్ మెంబర్ బి.వినీత, న్యాయవాదులు జి.మేరీ సునీత, తిగిరిపల్లి సుబ్బారావు, ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొనే సీతారాం, పెదవేగి సీఐ వెంకటేశ్వరరావు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పీవీఎస్ మునీశ్వరరావు, డీసీపీఓ సూర్య చక్రవేణి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత గల గోనె సంచులు ఇవ్వాలి



గుండుగొలను సొసైటీ వద్ద తహసీల్దార్‌కు తన గోడును విన్నవించుకుంటున్న రైతులు

భీమడోలు: గుండుగొలనులో నాణ్యతమైన గోనె సంచులు ఇవ్వాలని తహసీల్దార్ బి.రమాదేవికి శనివారం రైతులు మొరపెట్టుకున్నారు. భీమడోలు సొసైటీ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడే ఉన్న రైతులు తమకు ఇస్తున్న గోనె సంచులు నాణ్యత లేవని, ధాన్యం పోసిన రైతులకు నష్టం జరుగుతుందని వాపోయారు. కట్టగా ఇస్తున్న 50 గోనె సంచుల్లో 90 శాతం చిల్లులు, పాడై ఉన్నాయని తెలిపారు. ఇటీవల పొలం పిలుస్తుంది కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు కొత్త గోనె సంచులు ఇస్తామని చెప్పారని, కానీ ఆచరణలో అమలు కావడం లేదని రైతులు వాపోయారు. తహసీల్దార్ రమాదేవి రైతులను సమూదాయించే ప్రయత్నం చేసారు. గోనె సంచులను తీసుకుని వెళ్లే తరుణంలో రైతులు పరిశీలించుకోవాలని, నచ్చకుంటే అక్కడ వదిలేయాలని కోరారు. వాటి స్థానంలో కొత్త గోనె సంచులు ఇస్తామని రైతులు ఆందోళన చెందనవసరం లేదని రైతులకు భరోసా ఇచ్చారు. సాయంత్రం కొత్త గోనె సంచులు అందించామని తహసిల్దార్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో సింహాచలం, సొసైటీ సిబ్బంది, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట



ఉద్యోగ నియామక పత్రం అందిస్తున్న ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్ : జిల్లా పోలీస్‌శాఖ సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. ఏలూరు సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ అనారోగ్యంతో మృతిచెందిన ఎస్సై డి.నరసింహారావు కుమారుడు దిగమర్తి సుందర్‌కు శనివారం ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ పోస్టును మంజూరు చేస్తూ నియామక ప్రతం ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 60 రోజుల్లోనే ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు, ఉద్యోగ కల్పనకు చర్యలు చేపట్టామని చెప్పారు. దివంగత నరసింహారావు పోలీస్ శాఖలో 38 సంవత్సరాలు ఎనలేని సేవలు అందించారని గుర్తుచేసుకున్నారు. తండ్రి పేరు నిలబెట్టాలని ఎస్పీ సూచించారు. త్వరితగతిన ఉద్యోగ కల్పనకు కృషి చేసిన ఎస్పీ శివకిషోర్‌కు నరసింహారావు సతీమణి, కుమారుడు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

జనవరి 5న హైందవ శంఖారావం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హిందూ ఆలయాల రక్షణకు జనవరి 5న విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావం బహిరంగ సభ విజయవంతం చేయాలని విశ్వ హిందూ పరిషత్ ఆంధ్రప్రదేశ్ సహ ప్రాంత ప్రచారక్ జనార్ధన్ పిలుపునిచ్చారు. స్థానిక అంబికా ఫ్లేవర్స్ సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం ఏలూరు నగర హైందవ శంఖారావం సన్నాహక సమావేశం నిర్వహించారు. పలు హిందూ సంఘాల ప్రతినిధులు, విశ్వహిందూ పరిషత్, పరివార్ క్షేత్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి హిందువులు తరలి రావాల్సిన అవసరం ఉందన్నారు. హిందూ ఆలయాల్లో హిందూ ఉద్యోగులు మాత్రమే పని చేయాలని, ఇతర మతాల ఉద్యోగులను వెనక్కి పంపించాలనే పలు డిమాండ్లతో దేశంలోనే తొలిసారిగా ఈ హైందవ శంఖారావసభ ఏర్పాటుచేశామని చెప్పారు.